

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,27,864లు, బంగారం 90 మిల్లీగ్రాములు, వెండి 50 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



'బార్' నూతన కార్యవర్గాలు

పలు బార్ అసోసియేషన్లకు ఎన్నికలు నిర్వహించారు. నూతన కార్యవర్గాలు ఏర్పాటయ్యాయి.

- 8లో



కాంగ్రెస్ ఎమ్మెల్యేల నిరసన

అసెంబ్లీ గేటు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. అధికార పక్ష తీరును తప్పుపట్టారు.

- 8లో

న్యూస్‌రీల్

దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు



బొరిగుమ్మ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

జయపురం: సారాబట్టీ ఉద్యోగి నుంచి డబ్బు, బైక్, సెల్ ఫోన్లు దోచుకున్న ఇద్దరు దుండగులను అరెస్టు చేసినట్లు బొరిగుమ్మ పోలీసు అధికారి రచిత మడకామి శనివారం తెలిపారు. అరెస్టయిన వారిలో జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ పరిధి బొడొగుడ గ్రామానికి చెందిన రామచంద్ర హరిజన్, రాజు హరిజన్ ఉన్నారన్నారు. బొరిగుమ్మ దేశీ సారా బట్టీలో పనిచేస్తున్న అజయకుమార్ యాదవ్ బైక్‌పై వ్యక్తిగత పనిమీద గడబగుడ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా డాల్‌ఖాయి కూడలి వద్ద ఇద్దరు దుండగులు అజయ్‌ను అడ్డగించి బైక్, మొబైల్, డబ్బులను తీసుకుని పారి పోయారు. ఈ విషయం బట్టీ మేనేజర్‌కు అజయ్ తెలపగా, మేనేజర్ విజయకుమార్ గుప్త అజయ్‌తో కలసి బొరిగుమ్మ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి అరెస్ట చేసినట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

ఐఏఎస్ సుజాత రౌత్ కార్తికేయన్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ



సుజాత రౌత్ కార్తికేయన్

భువనేశ్వర్: భారత ప్రభుత్వ సేవా రంగం నుంచి సుజాత రౌత్ కార్తికేయన్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. ఆమె అభ్యర్థన మేరకు భారత ప్రభుత్వం ఈ మేరకు ఆమోదించింది. ఒడిశా కేడర్‌కు కేటాయించిన తొలి ఒడియా మహిళా ఐఏఎస్ అధికారి సుజాత రౌత్ కార్తికేయన్ కావడం విశేషం. ఆమె కంటే ముందు ఒడిశా కేడర్‌లో ఐఏఎస్ అధికారులుగా పనిచేసిన మహిళలు అంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడం గమనార్హం. సుజాత రౌత్ కార్తికేయన్ కేంద్రాపడా జిల్లాకు చెందిన మహిళ. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు అత్యంత సన్నిహితులుగా గుర్తింపు పొంది సంచలనం రేపిన వీకే పాండియన్ భార్య. ఆమె ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి హోదాలో కొనసాగుతూ ఐఏఎస్ సేవలకు స్వచ్ఛందంగా స్వస్తి పలికారు.

అశ్లీల నృత్య ప్రదర్శనలో ఘర్షణ

బరంపురం: స్థానిక గాంధీ నగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన దండనాచ్ యాత్రలో నిర్వహించిన అశ్లీల నృత్య ప్రదర్శనలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. నృత్యాలకు నిర్వాహక కమిటీ సభ్యులు అభ్యంతరం తెలపగా, యువకులు నృత్యాలు ప్రదర్శించాలని కోరడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఏడుగురిపై కేసు నమోదు చేశారు. బహిరంగంగా, జనవాసాల మధ్య ఇలాంటి అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి నివాళులు



షహీద్ లక్ష్మణ్ నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ సంఘమిత్ర దొళాయి

బరంపురం: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారితో వీరోచితంగా పోరాడిన సమర యోధుడు షహీద్ లక్ష్మణ్ నాయక్ అని బరంపురం మహానగరం నిగమ్ మేయర్ సంఘమిత్ర దళాయి అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు షహీద్ లక్ష్మణ్ నాయక్ 83వ వర్ధంతి సందర్భంగా బరంపురం మండల్ జైలులో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

లింగరాజు రుకుణ.. రథ యాత్రకు సన్నాహాలు

భువనేశ్వర్:

ఏకామ్ర క్షేత్రవాసుడు శ్రీ లింగ రాజు మహాప్రభువు రుకుణ రథ యాత్ర ఈ ఏడాది ఏప్రిల్ 5న జరగనుంది. ఈ మేరకు సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు యాత్ర ప్రారంభం అవుతుంది. ఆలయం ట్రస్ట్ బోర్డు సమావేశంలో రథ యాత్ర కార్యక్రమాలు ఖరారు చేశారు. ఈ నిర్ణయం ప్రకారం ఉదయం 5 గంటలకు మంగళ హారతి, ఇతర అనుబంధ సేవలు నిర్వహిస్తారు. ఉదయం 5.30 గంటలకు భక్తులకు సర్వ దర్శనం కల్పిస్తారు. ఒక గంట దర్శనం తర్వాత దీపధూపాదులు, శుద్ధి, మహాస్నానం, వస్త్ర అలంకరణ, సూర్య పూజ, ద్వార పాలకుల పూజాదులు ఉదయం 8 గంటలు సరికి పూర్తి చేయాలని ట్రస్టు బోర్డు నిర్ణయించింది. అనంతరం వల్లభ భోగం సమర్పిస్తారు. తిరిగి మరోసారి సూర్య పూజ, ద్వార పాలకుల పూజాదులతో లింగ రాజు ప్రభువుకు మహా స్నానం, అలంకరణ జరుగుతుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి యాత్ర సంబంధిత పూజలు జరుగుతాయి. మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత మహా దేవుని ఊరేగింపుగా తీసుకుని వెళ్లి రథంపై ఆసీనం చేసి పూజలు నిర్వహిస్తారు. రథాలకు కొయ్య గుర్రాలను కట్టి సాయంత్రం 4 గంటలకు రథం లాగడం ప్రారంభిస్తారు. రథం రామేశ్వరపట్నానికి చేరిన తర్వాత రాత్రి 7.30 గంటలకు శ్రీ రామేశ్వర ఆలయం లోనికి యాత్ర మూర్తుల్ని ప్రవేశ పెడతారు. తదుపరి సేవాదుల్ని ఆలయ ఆచార వ్యవహారాల ప్రకారం నిర్వహిస్తారు. మారు రథ యాత్ర (బహుడా) యాత్ర ఇదే తరహాలో నిర్వహించాలని నిర్ణయించారు. ఆ రోజున ఉదయం 5 గంటల నుంచి యాత్ర కార్యక్రమాలు చేపడతారు. ఉదయం 5.30 గంటల నుంచి రోష హోమం తదితర కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. భక్తులకు సర్వ దర్శనం ఉదయం 7.30 గంటల వరకు లభిస్తుంది. అనంతరం మహా స్నానం, సూర్య పూజ మరియు ద్వారపాలకుల పూజ ఉదయం 8.30 గంటల వరకు కొనసాగుతాయి. ఉదయం ధూపదీపాలతో భోగ మండప సేవలు ఉదయం 11.30 గంటలతో ముగిస్తారు. తదుపరి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒఢొరొ పాణా ఉత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు రథం పైకి యాత్ర విగ్రహాలు తరలిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రథం లాగి మారు యాత్ర మొదలు పెడతారు.



తయారీ దశలో లింగ రాజు మహా ప్రభువు రుకుణ రథం

సీసీ కెమెరాల నిఘా

ఈ సంవత్సరం రథం తయారీ ప్రాంగణంలో 2 సీసీటీవీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. మరో వైపు యాత్ర కదలికపై నిఘా వేసేందుకు మరో ప్రత్యేక సీసీటీవీ కెమెరా ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ పాలక వర్గం తెలిపింది.

రూ. 22 లక్షల వ్యయం అంచనా

ఈ సంవత్సరం రుకుణ రథ యాత్ర అంచనా వ్యయం రూ. 22 లక్షలు. యాత్ర సమయంలో రథానికి ఎదురుగా నిలబడకూడదని తెలిపారు. భక్తులకు యాత్రలో దేవుళ్ల దర్శనం కనులారా లభించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

సకాలంలో యాత్ర నిర్వహణ

రుకుణ రథ యాత్రలో అవాంఛనీయ జాప్యం పట్ల కఠినంగా వ్యవహరిస్తారు. రథం సరైన సమయంలో కదలాల్సిందే. ఈ క్రమంలో ఏదైనా గందరగోళం తలెత్తితే కఠినమైన చర్యలు తీసుకుంటారని ముందస్తుగా హెచ్చరించారు. స్థానిక ప్రదక్షిణ భవన్ సమావేశ మందిరంలో లింగ రాజ్ రుకుణ రథ యాత్ర సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఖుర్దా జిల్లా మేజిస్ట్రేట్ చంచల్ రాణా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏకామ్ర నియోజక వర్గం ఎమ్మెల్యే బాబూ సింగ్, నగర మేయర్ సులోచనా దాస్, ఆలయ కార్యనిర్వాహక అధికారి రుద్ర నారాయణ మహంతి పాలుపంచుకున్నారు.

పర్లాకిమిడి స్టేషన్ అభివృద్ధికి చర్యలు



పర్లాకిమిడి రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులు పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంఖ్వాల్, డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

- ఈస్టుకోస్టు రైల్వే జీఎం వెల్లడి

పర్లాకిమిడి: పర్లాకిమిడి రైల్వే స్టేషన్‌ను ఈస్టు కోస్టు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంఖ్వాల్, వాల్తేరు డీఆర్‌ఎం లలిత్ బోహ్రా శనివారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమృత్‌భారత్ రైల్వేస్టేషన్ అభివృద్ధిలో భాగంగా పర్లాకమిడి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నట్టు పేర్కొన్నారు. రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధ పనులు, వెయిటింగ్ హాల్, టాయిలెట్స్, వాటర్ బూత్స్, సీటింగ్ ఏర్పాట్లు, 12 మీటర్ల ఓవర్‌బ్రిడ్జి ఫుట్‌స్టెప్, విద్యుత్‌స్టేషన్, ప్లాట్‌ఫారం పనులు పర్యవేక్షించారు. అనంతరం ఈస్టుకోస్టు జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంఖ్వాల్ విలేకరులతో మాట్లాడుతూ..స్టేషన్లో ఇన్‌ఫ్రాస్టక్చర్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సెక్షన్ల వేగాన్ని పెంచడానికి ప్రయత్నిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర, ఒడిశాలో అమృత్‌భారత్ రైల్వే స్టేషన్ల పనులలో పర్లాకిమిడి ప్రథమ స్థానంలో ఉందన్నారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు కలపడానికి అయిదు క్రాసింగ్ స్టేషన్ల అప్రూవల్ అవసరమని, ప్రస్తుతానికి కేంద్ర రైల్వే బోర్డు ఒకటి ఆమోదం తెలిపిందని పరమేశ్వర్ ఫంఖ్వాల్ అన్నారు. స్టేషన్లో లిఫ్టు, చిన్నచిన్న పనులు మినహాఇస్తే మొత్తం పనులు పూర్తయ్యాయన్నారు. త్వరలో స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం గుణుపురం రైల్వేస్టేషన్ పరిశీలనకు ప్రత్యేక రైలులో వెళ్లారు. ఆయన వెంట సీనియర్ డివిజనల్ మేనేజరు కె.సందీప్, ఇతర ఇంజినీర్లు ఉన్నారు.



టిక్కెట్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న రైల్వే ఉన్నతాధికారులు





ఉద్యమాలతోనే హక్కుల సాధన



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రదీప్ శెట్టి

జయపురం: అఖిల భారత యువజన సంఘం కొరాపుట్ జిల్లా శాఖ సమావేశం శనివారం స్థానిక కార్మిక భవనంలో జరిగింది. ఏఐవైఎఫ్ (ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్)కొరాపుట్ శాఖ మాజీ యువ సంఘ నేత రామ కృష్ణదాస్ యువజన సంఘ పతాకాన్ని ఎగుర వేశారు. అనంతరం భగత్ సింగ్, సహిద్ లక్ష్మణ నాయిక్ ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర యువజన సంఘ అధ్యక్షుడు ప్రదీప్ శెట్టి దేశంలోను, రాష్ట్రాలలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగం, ఆదాయం లేక పడుతున్న పాట్లు, వారి సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిపై నిప్పులు చెరుగుతూ ప్రసంగించారు. తమ సమస్యల పరిష్కారానికి యువత ఉద్యమించాలన్నారు. మే 17న ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో జాతీయ సమ్మేళనం జరుగుతుందని, అందులో పాల్గొనేందుకు మే 7, 8వ తేదీల్లో కొరాపుట్‌లో రాష్ట్ర సమ్మేళనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్ కుమార్ మహంతి, పార్టీ జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రౌళో అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలోని 14 సమితుల్లో యువతను సమీకరించి సంఘాన్ని బలోపేతం చేసే బాధ్యతను కుమార జాని, మధు జానిలకు అప్పగించారు.

ఏఎస్పీ మనోబ్రతకు డీజీపీ డిస్క్ అవార్డు



కొరాపుట్ ఏఎస్పీ మనోబ్రత సత్పతి

కొరాపుట్: ఒడిశా పోలీస్ విభాగంలో విశిష్టమైన డీజీపీ డిస్క్ అవార్డు కొరాపుట్ ఏఎస్పీ మనోబ్రత సత్పతికి లభించింది. శనివారం రాష్ట్ర పోలీస్ విభాగం ఆదేశాలు వెలువరించింది. ఏప్రిల్ 1న రాష్ట్ర పోలీస్ అవతరణ దినోత్సవం సందర్భంగా రాజధానిలో అవార్డు అందజేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీచర్ మృతి

జయపురం: ఒక ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ టీచర్ చనిపోవడంతో గ్రామస్తులు చలించిపోయారు. ఆ ఉపాధ్యాయుడు జయపురం సబ్‌డివిజన్‌బొయిపరిగుడ మహుళి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న అజయ కుమార్ జెన. అతడు కటక్ మెడికల్‌లో గత రాత్రి మరణించారు. లభించిన వివరాలు ప్రకారం గత 25 వ తేదీ ఉదయం బొయిపరిగుడ సమితి మహుళి ఉన్నత పాఠశాల గేటు సమీపంలో నించుని ఉండగా బైక్ ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు అతడిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బరంపురం, అక్కడి నుంచి కటక్‌కు తరలించారు. కటక్ మెడికల్‌లో ఆయన తుది శ్వాస విడిచారు. అతడి పార్థివ దేహాన్ని అతడి అత్తవారి గ్రామం కటక్ జిల్లా బొయిచుర గ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపారు.



ఉపాధ్యాయుని మృతదేహాన్ని శ్మశానానికి తీసుకువెళ్తున్న గ్రామస్తులు

ఆటో-బైక్ ఢీ : వ్యక్తి మృతి



మత్తిలి ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న అర్జున్



కాలికి గాయంతో సుదర్శన్ పుటియా



బలమైన గాయంతో చికిత్స పొందుతున్న ఇంద్రధర్ పుటియా

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి మంజారిగూఢ రహదారిలో శనివారం ఉదయం ఆటోను బైక్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. మృతి చెందిన మహిళను ఎస్.రత్నమాణిగా గుర్తించారు. ఆమె మత్తిలి పరిసర ప్రాంతంలో ఆటో ఎక్కినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న మత్తిలి పోలీసు ఐఐసీ దేవదత్తు మల్లిక్ మత్తిలి ఆరోగ్య కేంద్రానికి చేరుకుని క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించారు. గాయపడిన ఇంద్రధర్ పుటియా, అర్జున్ బదామి, సుదర్శన్ పుటియాలు మత్తిలి సమితి కాలియాగూడ గ్రామానికి చెందిన వారు.

త్యాగధనుడు షహీద్ లక్ష్మణ్ నాయక్

- వర్ధంతి సభలో వకర్తలు
- నాయక్‌కు ఘన నివాళులు

జయపురం: షహీద్ లక్ష్మణ నాయక్ గొప్పదేశ భక్తుడని, దేశ స్వాతంత్ర్యం కోసం చిరునవ్వుతో ఉరికంబమెక్కిన త్యాగధనుడని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం లక్ష్మణ నాయక్ 83వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక గుప్తేశ్వర్ కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మణ నాయక్ స్మృతి సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు లక్ష్మణ నాయక్ జీవితంలో దేశ విముక్తి కోసం చేపట్టిన ఉద్యమాలు, పోరాటాలు వివరించారు. ఈ సందర్భంగా నాయకపై నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ నాయక్ స్మృతి సమితి అధ్యక్షులు బాలారాయ్, సలహాదారు, న్యాయవాది మదన మోహననాయక్, సాధారణ కార్యదర్శి మాధవ చౌదరి, కార్యదర్శి వెంకటరావు పటాన్నయక్, ఉపాధ్యక్షులు బాసు నాయక్, కోశాధికారి కృష్ణచంద్ర హత్త, ఆర్గనైజర్ హరిష్ ముదులి, సురేంద్ర ఖొర, బెరాగి భోత్ర పాల్గొన్నారు. అనంతరం జయపురం సబ్‌కలెక్టర్, మున్సిపాలిటీ కార్య నిర్వాహక అధికారిణి కుమారి ఎ.శౌర్యారెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్రో, మున్సిపాలిటీ అదనపు కార్యనిర్వాహక అధికారి కృతివాస్ సాహు, జయపురం సబ్‌డివిజన్ సమాచార, ప్రజా సంబంధాల అధికారిణి యశోద గదబ తదితరులు సహిద్ లక్ష్మణ నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత జయపురం పూజ్య పూజ సంసద్ వారు స్వాతంత్ర్య సమర యోధుని ప్రతిమకు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పూజ్య పూజసంసద్ అధ్యక్షులు కేదార్ నాథ్ బెహర, కార్యదర్శి తపన త్రిపాఠీ, కోశాధిపతి బైరాగి సాహు తదితరులు నాయక్‌కు నివాళులు అర్పించారు.

కొరాపుట్: స్వాతంత్ర్య సమర యెధుడు సాహిద్ లక్ష్మణ్ నాయక్ వర్ధంతిని జిల్లా కేంద్రం కొరాపుట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు సస్మితా మెలక, కొరాపుట్ మున్సిలిటీ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సిమిలిగుడ పట్టణంలో సాహిద్ లక్ష్మణ్ నాయక్ సర్కిల్‌లో పుర ప్రముఖులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దమంజోడి పట్టణంలో గిరిజన నేతలు, స్థానికులు నివాళులర్పించి నాయక్ త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు. కొరాపుట్ జిల్లాకు చెందిన గిరిజన స్వాతంత్ర్య సమర యెధుడు లక్ష్మణ్ నాయక్‌ని బ్రిటిష్ వారు బ్రహ్మపుర జైలులో ఉరి తీసిన విషయాన్ని వివరించారు.



జయపురం: లక్ష్మణ నాయిక్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న సబ్‌కలెక్టర్, చైర్మన్ తదితరులు



జయపురం: నివాళులర్పిస్తున్న జయపురం లక్ష్మణ నాయక్ స్మృతి సమితి, పూజ్య, పూజసంసద్ ప్రతినిధులు



కొరాపుట్: లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వి.కీర్తి వాసన్, జెడ్పీ చైర్మన్ సస్మితా మెలక తదితరులు



కొరాపుట్: సిమిలిగుడలో నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తూ..



రాపుట్: దమంజోడిలో గిరిజన నేతల నివాళులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో విజయ్ సహాక్ మృతదేహం

బరంపురం: లంజిపల్లి 16వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పుల్లా గ్రామానికి చెందిన విజయ్ సహాక్(35) యువకుడు శనివారం తన స్వగ్రామం నుంచి సైకిల్‌పై బరంపురం వస్తున్నారు. వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొంది. విజయ్ సహాక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన తరువాత కారు డ్రైవర్ తన వాహనాన్ని నిలపకుండా పరారయ్యాడు. ఈ ఘటనపై గ్రామస్తులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. కిలో మీటర్ల మేరా వాహనాలు నిలిచిపోయాయి, పోలీసులు, తహసీల్దార్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకితెచ్చారు.

పునరావాసం కల్పించేందుకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్

పర్లాకిమిడి: స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జిల్లా స్థాయి ఆరోగ్యప్రాప్త కుష్టురోగుల పునరావాసంపై వర్క్‌షాపును జిల్లా సామాజిక సురక్షా, వికలాంగుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ బిజయకుమార్ దాస్, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, సి.డి.ఎం.ఓ. డాక్టర్ మహమ్మద్ ముబారక్ అలీ, జిల్లా ప్రజాస్వస్థ్య అధికారి రబినారాయణదాస్, డాక్టర్ ఇందిరా కుమారి మహాపాత్రో హాజరయ్యారు. కుష్టురోగుల గుర్తింపు, లక్షణాలు, చికిత్స వంటివే కాకుండా పునరావాసం కల్పించడానికి వివిధ బ్లాక్ స్థాయి అధికారులతో చర్చించారు. కుష్టురోగులను బ్లాక్ స్థాయిలో వారిని గుర్తించి చికిత్స చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లా సామాజిక సురక్షా అధికారి సంతోష్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.

52 ఎకరాలపై ల్యాండ్ మాఫియా కన్ను

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి పరశురాం మౌజా డాక్టర్ భంజరీ గ్రామంలో గంజాం, గజపతి జిల్లా రియల్ ఎస్టేట్ మాఫియా 52 ఎకరాల భూమిని కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం ఈ భూమి విలువ కోట్ల రూపాయలు చేస్తుంది. జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఎ.డి.ఎం.రాజేంద్ర మింజ్, ఆదర్శ పోలీస్ స్టేషన్ ఐఐసి ప్రశాంత భూపతికి గిరిజనులు శనివారం ఫిర్యాదు చేశారు. నరహరిపురం మౌజా ఖాతా నంబర్ 30, పరశురాంపురం మౌజా, ఖాతా నంబర్ 51లో మొత్తం 52 ఎకరాల భూమి మోటూరు కృష్ణమూర్తి ఆధీనంలో ఉండేది. అయితే భూములు సాగు హక్కు గిరిజనులకు ఉంది. ఆయన చనిపోయిన తరువాత ఈ భూములు మోటూరు మాధవ తన పేరున ఆర్.ఓ.ఆర్.పట్టా చేయించుకున్నాడు. సాగుహక్కు ఉన్న గిరిజనులు.. ఆ భూహక్కులను తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

పార్టీలో ఉంటూ ద్రోహం చేస్తే మనుగడ కష్టం

శ్రీకాకుళం: టీడీపీలో ఉంటూ ద్రోహం చేసిన వారికి పార్టీలో మనుగడ, గుర్తింపు ఉండదని, దీనికి జిల్లాలోని రాజకీయమే నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. పట్టణంలో శనివారం జరిగిన ఆ పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని, చనిపోయిన తర్వాత పార్టీ జెండానే కప్పాలని చెప్పిన నాయకులే పార్టీకి ద్రోహం చేసేలా వ్యవహరించారని వ్యాఖ్యానించారు. గతంలో శ్రీకాకుళం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్న బాధ తనలో ఉండేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గొండు శంకర్ తమతో కలసి వస్తుండడంతో జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేయగలుగుతున్నామని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలన్నీ పరోక్షంగా గుండ కుటుంబీకులకు ఉద్దేశించి చేసినట్లుగా ఉన్నాయని సభకు హాజరైన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందనడానికి కింజరాపు, గొండు కుటుంబాలే నిదర్శమన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'రికార్డు'కెక్కిన రాళ్లపాడు పాఠశాల

పోలాకి: తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభను ప్రోత్సహించే 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థ పోలాకి మండలం రాళ్లపాడు ప్రాథమిక పాఠశాలకు అవార్డును అందజేసింది. శనివారం సంస్థ ప్రతినిధి కె.రామకృష్ణరాజు పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. ఇక్కడి విద్యార్థులు 118 రసాయన మూలకాల పేర్లు చెప్పటంతోపాటు, 20 అంకెల సంఖ్యల వర్గమూలాలు కట్టడం,' పై'విలువను 100 స్థానాల వరకు చెప్పటం, 360 డిగ్రీల వరకు త్రికోణమితి విలువలు చెప్పడం, ఎల్రక్టానిక్ విన్యాసాలు రాయటం, పై తరగతులకు చెందిన అనేక గణిత సమస్యలను సైతం సులువుగా సాధించటం తదితర అంశాల్లో ప్రతిభను సంస్థ గుర్తించింది. అందులో భాగంగానే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బంటుపల్లి ధనుంజయదేవ్ కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డును అందించారు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఉమ్మర్‌కోట్ ఎన్నికయిన నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గం



నబరంగ్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరాజుద్దీన్ అహ్మద్



నబరంగ్‌పూర్ బార్ అసోసియేషన్ కి 3వ సారి కార్యదర్శిగా ఎన్నికయిన తపన్ సింగ్

కొరాపుట్:

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో కూడా బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. శనివారం పలు చోట్ల కొన్ని పదవులకు పోలింగ్ జరగగా, మిగతా చోట్ల ఏకగ్రీవాలు కొనసాగాయి. సాయంత్రానికి అన్ని ప్రాంతాలలో ఫలితాల వెల్లడి పూర్తయ్యింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సిరాజుద్దిన్ అహ్మద్, కార్యదర్శిగా వరుసగా మూడో సారి తపన్ సింగ్‌లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా సదాశివ సాహు, ఇతర పదవులకు షేక్ బాబా అలీషా, గజేంద్ర దాస్‌లు ఎనికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సీహెచ్ బాబా యుగంధర్, కిశోర్ పట్నాయక్ లు ప్రకటించారు.మరో వైపు నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రశాంత్ కుమార్ సాహు, ఉపాధ్యక్షురాలుగా విజయ లక్ష్మీ పాణిగ్రాహి, కార్యదర్శిగా శంతున్ బాహినిపతి, సంయుక్త కార్యదర్శిగా సుదాంశు సాథ్‌లు ఎన్నికయ్యారు. కొరాపుట్ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ప్రబాత్ కుమార్ మహాపాత్రో, ఉపాధ్యక్షునిగా కృష్ణ చంద్ర స్వయిన్, కార్యదర్శిగా సునీల్ కుమార్ జెనా,కోశాధికారీగా కామాక్ష్య ప్రసాద్ మజ్జి ఎన్నికయ్యారు.

పర్లాకిమిడి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా జితేంద్రకుమార్

పర్లాకిమిడి: జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం పర్లాకిమిడి బార్ అసోసియేషన్ ఎన్నికలు శాంతియుతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా జితేంద్ర కుమార్ పట్నాయిక్ ఎన్నికవ్వగా, ఉపాధ్యక్షునిగా రౌతు బాబురావు, సెక్రటరీగా మోది పృథ్వీరాజ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా సౌమ్య సౌరభ్ పట్నాయిక్, కోశాధికారి సందీప్ కుమార్ పట్నాయిక్, లైబ్రరీ సెక్రటరీ రఘునాథ పాత్రోలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పండి విశ్వనాథ్, యడ్ల శివకుమార్, మలయమాధురీ దేవి, అశోక్ కుమార్ అధికారి, చందన్ కుమార్ పట్నాయిక్ తదితరులు ఎన్నికయ్యారు. బార్ ఎన్నికలకు జడ్జిలుగా హీరాచంద్, శశాంక శేఖర్ సాబత్‌లు వ్యవహరించారు.

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి బార్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏర్పడింది. అధ్యక్షుడిగా పృథ్వీపాల్ సింగ్, ఉపాధ్యక్షుడిగా సరోజ్ కుమార్ మహంతి ఎన్నికయ్యారు.



రాయగడ బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం

కొట్‌పాడ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మణి ప్రసాద్

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్ పాడ్ లో జరిగిన కొట్‌పాడ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ప్రముఖ రాజకీయ వేత్త మణి ప్రసాద్ పట్నాయిక్ ఎన్నికయ్యారు.

రాయగడ బార్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గం

రాయగడ: రాయగడ బార్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా దేవి ప్రసాద్ పట్నాయిక్, ఉపాధ్యక్షుడిగా సురేంద్ర కుమార్ సాహు, కార్యదర్శిగా మంగళ ముర్తి బేవూరియా, సహా కార్యదర్శిగా శంకర్ రావు దోర, కోశాధికారి గా మోహన్ నాయక్ ఎన్నుకున్నట్లు ప్రకటించారు.



పర్లాకిమిడి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేంద్ర కుమార్ పట్నాయిక్, పక్కన సెక్రటరీ యం.పృథ్వీరాజ్



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గంతో అధ్యక్షులు జితేంద్ర కుమార్ పట్నాయిక్, ఉపాధ్యక్షులు బాబూరావు, యం.పృథ్వీరాజ్ తదితరులు



కొరాపుట్‌లో ఎన్నికైన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గేటు ముంగిట కాంగ్రెస్ ఎమ్మెల్యేల నిరసన



శాసన సభ ప్రవేశ మార్గం గేటు ముంగిట నిరసన ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

భువనేశ్వర్: రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మరోసారి నిరుత్సాహం ఎదురైంది. శాసన సభ ప్రాంగణం లోనికి వెళ్లబోతుండగా రక్షక భటులు అడ్డుకుని బలవంతంగా బయటకు నెట్టారు. ఈ చర్య పట్ల కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. శనివారం ఈ విచారకర సంఘటన చోటు చేసుకుంది. సభలో గందరగోళం సృష్టించారనే ఆరోపణ కింద కాంగ్రెస్‌కు చెందిన 14 మంది ఎమ్మెల్యేల్ని స్పీకరు సస్పెండు చేసిన విషయం తెలిసిందే. ఈ వర్గానికి చెందిన వారు శాసన సభ ప్రాంగణం లోనికి వెళ్లబోతుండగా రక్షక భటులు గేటు దగ్గర అడ్డుకోవడంతో గేటు ముంగిట బైఠాయించి నిరసన ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆరోపించారు. ఇంతలో ఎండ వేడిమి తాళలేక కాంగ్రెస్ శాసన సభా పక్ష నాయకుడు రామ చంద్ర కదమ్ అస్వస్థతకు గురయ్యారు. వైద్య బృందం ఘటనా స్థలం సందర్శించింది. అస్వస్థతకు గురైన నాయకునికి సముచిత చికిత్స అందజేసింది.

రాష్ట్ర గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



గవర్నర్‌ను కలిసి కాంగ్రెస్ నాయికుల బృందం


భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ నుంచి తన పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. దీనిపై జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటిని శనివారం రాజ్ భవన్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు భక్త చరణ్ దాస్, పార్టీ సీనియర్ నాయకులు నిరంజన్ పట్నాయక్, జయదేవ్ జెనా, శ్రీకాంత్ జెనా, కాంగ్రెస్ శాసన సభ పక్ష నాయకుడు రామ్‌చంద్ర కదమ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న నేరాలు అంశాన్ని ప్రస్తావించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన 14 మంది ఎమ్మెల్యేలను అప్రజాస్వామిక పద్ధతిలో శాసన సభ నుంచి సస్పెండ్ చేశారు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై పెరుగుతున్న నేరాలపై దర్యాప్తు చేయడానికి సభా కమిటీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు నిరవధికంగా ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని చేసిన అభ్యర్థన పట్ల ప్రతినిధి బృందానికి గవర్నరు హామీ ఇచ్చినట్లు తెలిపారు. మరో వైపు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి దీర్ఘ కాలంగా ఖాళీగా ఉంది. తక్షణమే భర్తీ చేసి బాధిత మహిళలకు సత్వర న్యాయం చేకూర్చే మార్గం సుగమం చేయాలని కాంగ్రెసు ప్రతినిధి బృందం గవర్నర్‌కు విజ్ఞప్తి చేసింది. గవర్నర్‌ను కలిసిన తర్వాత జయపురం నియోజకవర్గ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి మాట్లాడుతూ సస్పెండ్ అయిన శాసనసభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు త్వరలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుస్తామన్నారు. ''మేము ప్రజలచే ఎన్నుకోబడ్డాము. అసెంబ్లీలో వారి సమస్యలను లేవనెత్తడం మా బాధ్యత. కానీ దాని ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నిషేధించారు. ఈ విషయాన్ని మేము గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాము. ఇక్కడితో తమ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సాధ్యం కాకుంటే భారత రాష్ట్రపతిని కూడా కలవాలని నిర్ణయించినట్టు పేర్కొనాన్నర.

విమానాశ్రయంలో అరుదైన సరీసృపాలు



కస్టమ్స్ అధికారులు స్వాధీనపరచుకున్న అరుదైన పాము

భువనేశ్వర్: హాంకాంగ్ నుంచి అనుమానాస్పదంగా తరలి వచ్చిన ప్యాకేజీపై కస్టమ్స్ అధికారుల దృష్టి పడింది. దీనిని తనిఖీ చేయడంతో గుట్టు రట్టు అయింది. ఈ వ్యవహారంలో వన్యప్రాణుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తేటతెల్లం అయింది. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు ఈ తనిఖీ చేపట్టారు. ఈ ప్రక్రియలో పాములు, తాబేళ్లతో ఉడుములు, తొండ జాతి 9 అపరూప వన్య ప్రాణులు బయటపడ్డాయి. ఇవన్నీ అన్య దేశ వన్య ప్రాణులుగా ప్రాథమిక విచారణలో తేలింది. వీటిని బిస్కట్ల అట్టపెట్టెలో సర్ది రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వన్యప్రాణుల స్మగ్లర్లు వాయు మార్గం గుండా భువనేశ్వర్ మీదుగా అంతర్జాతీయ అక్రమ రవాణా ఎంచుకుంటున్నట్లు ఈ సంఘటన స్పష్టం చేసిందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. తాజా సంఘటనలో బ్యాంకాక్ నుంచి భువనేశ్వర్ మీదుగా చెన్నై తరలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అనుమానాస్పద తనిఖీలో అపురూపమైన అన్య దేశ వన్య ప్రాణులు బయట పడడంతో వీటి పరిశీలన కోసం తక్షణమే అటవీ శాఖ, స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యులు దర్యాప్తు కోసం రంగంలోకి దింపారు. వీరి ఆధ్వర్యంలో వీటిని స్వాధీనం చేసుకున్న తర్వాత రాష్ట్ర అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ అక్రమ రవాణా జంతువులను మరియు స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లో పాల్గొన్న వ్యక్తులను గుర్తించడానికి అనుబంధ శాఖల అధికారులు సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. చెన్నైకి చెందిన నిందితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అన్య దేశ వన్య ప్రాణులను మార్కెట్‌లో అక్రమ అమ్మకం కోసం భారతదేశం అంతటా వివిధ ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు భావిస్తున్నారు. ఈ సంఘటనతో విమానాశ్రయాలు, కార్గో టెర్మినల్స్ వద్ద తక్షణమే నిఘా పెంచాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తించారు. తనిఖీలో స్వాధీన పరచుకున్న వన్య ప్రాణులు ప్రస్తుతం వన్యప్రాణి అధికారుల సంరక్షణలో ఉన్నాయి. త్వరలో వాటిని సహజ ఆవాసాలకు లేదా తగిన సురక్షిత గమ్య స్థానాలకు సురక్షితంగా తరలించి పునరావాసం కల్పించడానికి మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



అధికారులు స్వాధీనపరచుకుని అన్య దేశపు పాము



స్థానిక విమానాశ్రయంలో చిక్కిన విదేశీ ఉడుములు

అట్రాసిటీ చట్టాలపై దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అట్రాసిటీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టంపై జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీతో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, నరసన్నపేట పేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి సమీక్ష నిర్వహించారు. అట్రాసిటీ కేసుల పరిష్కారం ఆలస్యం కాకూడదన్నారు. సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వ మోహన్ రెడ్డి గత సమావేశంలో అంశాలపై చేపట్టిన పనులు వివరించారు.

ఉత్సాహంగా వంటల పోటీలు



వంటల పోటీల్లో పాల్గొన్న 50 ఏళ్లకు పైబడిన మహిళలు



వంటల పోటీల్లో పాల్గొన్న 25 నుంచి 40 ఏళ్ల లోపు మహిళలు

రాయగడ: ఉగాది ఉత్సవాల్లో భాగంగా స్థానిక తేజస్వి మైదానంలో శనివారం మహిళలకు వంటలు పోటీలు నిర్వహించారు. ఇంట్లో తయారు చేసిన వంటకాలను పోటీలో ప్రదర్శించారు. 25 నుంచి 40 ఏళ్ల మధ్య, 50 ఏళ్ల పైబడిన మహిళల మధ్య పోటీలు నిర్వహించారు. గెలిపొందిన వారికి ఉగాది రోజున బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు .

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి

- రాష్ట్ర మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక
- కొనసాగుతున్న ఉగాది పోటీలు

రాయగడ: మన పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు వాటిని గౌరవించి భావితరాలకు దిక్సూచిగా నిలవాలని రాష్ట్ర మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక అన్నారు. స్థానిక తేజస్వీ మైదానంలో రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ పేరిట నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా శనివారం పదేళ్ల లోపు చిన్నారుల మధ్య నిర్వహించిన వేద, శ్లోక పఠనం పోటీలను ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయగడ జిల్లా వంటి ప్రాంతంలో తెలుగు వారు అత్యధిక శాతంగా నివసిస్తున్నారన్నారు. అయితే తెలుగు వారు జరుపుకునే ఉగాది వేడుకలకు ఒడియా ప్రజలను ఆహ్వానించడం ఒడియా వారు జరుపుకునే పాణా సంక్రాంతికి తెలుగు వారిని ఆహ్వానించుకోవడం ఆనవాయితీగా మారడం విశేషమని అన్నారు. ఇక్కడ భాష పరమైన భేదభావాలకు తావులేకుండా అంతా కలసి కట్టుగా ఇటువంటి తరహా ఉత్సవాలను జరుపుకోవడం వారి సమైఖ్యతకు అద్దం పడుతుందని అన్నారు. అనంతరం తెలుగు ఉగాది సందర్భంగా ఆయన అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి సంప్రదాయాలను కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రాయగడ రచయితల సంఘం అధ్యక్షులు టి.వి.ఎస్.ఆర్.అప్పారావు, బార్శి వరప్రసాద్‌రావు, పట్టణ ప్రముఖులు చంద్రమౌళి కుముంధాన్, సంఘం నాయుడు శిల్లా జగన్నాథరావు, గొర్లెల అప్పారావు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి హిమిరిక

ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు..

చిన్నారుల మధ్య నిర్వహించిన వేద, శ్లోక పఠన పోటీల్లో 43 మంది పాల్గొన్నారు. తడబడిన మాటలతో వేద, శ్లోకాలు పఠిస్తుండటం అందరిని మంత్ర ముగ్దులను చేసింది. హైందవ సంప్రదాయానికి అద్దం పట్టే ఇటువంటి తరహా పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని ఎస్.జె.కౌషిక్, ద్వితీయ స్థానంలో శ్రావణి, తృతీయ బహుమతిని కె.జస్విక్ దక్కించుకున్నారు. గెలుపొందిన విజేతలతోపాటు పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను నిర్వాహకులు అందించారు. న్యాయనిర్ణేతలుగా కె.శోభారాణి, కస్తూరి సాహు, పి.కళ్యాణి వ్యవహరించారు.

అలరించిన ఒన్‌మినిట్ గేమ్ షో..

ఉగాది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మహిళల మధ్య ఒన్‌మినిట్ గేమ్ షో కార్యక్రమం మహిళల్లో ఉత్సాహాన్ని నింపింది. పోటీల్లా 81 మంది మహిళలు పాల్గొనగా వారిని రెండు బృందాలుగా విభజించి నిర్వాహకులు పోటీలను నిర్వహించారు. పోటీలను సుజాత పాలో, పి.రోజాలను నిర్వహించారు. ఉత్సాహభరితంగా సుమారు మూడు గంటల పాటుగా పోటీలు జరిగాయి. విజేతలుగా ప్రజ్ఞాని సాహు, పి.పద్మజ, బి.ప్రీతిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుపొందారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.



పోటీలకు తల్లిదండ్రులతో వచ్చిన చిన్నారులు



వేదశ్లోక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న చంద్రమౌళి కుముంధాన్ తదితరులు



శ్లోకాలను పఠిస్తున్న చిన్నారి



వన్ మినిట్ గేమ్‌షో ఆడుతున్న మహిళలు



గేమ్ షోలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలు



గేమ్ షోలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

క్లుప్తంగా

విద్యార్థి మృతిపై నివేదిక ఇవ్వండి


డీవీజీ శంకరరావు, ఎస్టీ కమిషన్ చైర్మన్

పార్వతీపురం టౌన్: సీతంపేట ఐటీడీఏ పరిధి దోనుబాయి ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆదేశించారు. విద్యార్థి సవర చలపతిరావు పాఠశాలలో 9వ తరగతి చదువుతూ మంచం పైనుంచి పడి శుక్రవారం మృతి చెందిన విషయమై సంబంధిత అధికారులతో డీవీజీ శనివారం మాట్లాడారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

సబ్‌జైల్ ఆకస్మిక తనిఖీ


సబ్ జైల్‌ను సందర్శిస్తున్న జిల్లా జడ్జి సాయికళ్యాణ్ చక్రవర్తి, తదితరులు

విజయనగరం లీగల్: జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ (న్యూ ఢిల్లీ) ఉత్తర్వుల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌ను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించి ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం సబ్ జైల్‌లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను పరిశీలించారు. జైల్‌లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యమని చెప్పారు. అలాగే వంటగదిని పరిశీలించారు. పరిశీలనలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె. సూర్య ప్రకాష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ డి. సీతారాం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పీబీఎస్ సాయి పవిత్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సూపరింటెండెంట్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ ఏజెన్సీ లైసెన్స్ రద్దు

- మరో పది మెడికల్ షాపుల లైసెన్స్‌లను తాత్కాలికంగా నిలిపివేత

విజయనగరం ఫోర్ట్: నిబంధనలు అతిక్రమించిన ఓ మెడికల్ ఏజెన్సీ లైసెన్స్‌ను రద్దు చేయడంతో పాటు మరో పది మెడికల్ దుకాణాల లైసెన్స్‌లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఔషధ నియంత్రణశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. రజిత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. ఆపరేషన్ గరుడలో భాగంగా కొద్ది రోజుల కిందట జిల్లాలో పలు మెడికల్ షాపులను (మందుల దుకాణాలు) విజిలెన్స్, ఔషధ నియంత్రణశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారని చెప్పారు. ఈ క్రమంలో పది మెడికల్ షాపుల్లో కాలం చెల్లిన మందులు ఉన్నాయని, అదేవిధంగా జిల్లా కేంద్రంలోని రత్నం ఫార్మాస్యూటికల్స్ ఏజెన్సీలో కాలం చెల్లిన మందులు అధిక మొత్తంలో ఉండడంతో పాటు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే దగ్గు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు.దీంతో ఏజెన్సీ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న పది మందుల షాపుల లైసెన్స్‌లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెప్పారు.

అప్రమత్తంగా ఉండండి


గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, తదితరులు

నెల్లిమర్ల: ఈవీఎం గొడౌన్ భద్రతపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని గొడౌన్‌ను శనివారం ఆయన సందర్శించారు. షట్టర్లకు వేసిన సీళ్లను తెరిపించి, లోపల గదుల్లో ఉంచిన ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం దగ్గరుండి సీళ్లు వేయించారు. పరిశీలనలో డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీఓ డి.కీర్తి, తహసీల్దార్ సుదర్శనరావు, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, ఇతర రెవెన్యూ సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు సముద్రపు రామారావు పాల్గొన్నారు.

గంజాయి సరఫరా చేసే వ్యక్తి అరెస్ట్


పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

విజయనగరం క్రైమ్: మూడేళ్ల కిందట నమోదైన కేసులో నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయి సరఫరా చేసే గోపాల్ అనే వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. 2022లో గంజాయి సరఫరా చేస్తూ పిపెండస్, శిశుమహర్ అనే ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. అప్పట్లో వారిపై కేసు నమోదు చేశారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు వారికి గంజాయి సరఫరా చేసిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు జిల్లా మేకవరం పంచాయతీకి చెందిన గోపాల్‌గా పోలీసులు నిర్ధారించారు. ఈక్రమంలో గోపాల్‌ను శనివారం జిల్లా కేంద్రంలో అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

మా వాళ్లే.. ఉద్యోగం ఇచ్చేయ్..

- కూటమి నాయకుల అధికార దర్పం..
- లక్కిడాం పీఏసీఎస్‌లో ఇద్దరికి ఉద్యోగాలు
- నిబంధనల ప్రకారం కుదరదన్న ఉద్యోగులు
- వారిపై ఒత్తిడి తీసుకువచ్చిన మంత్రి బంధువు

గంట్యాడ: కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ ఇతరులను ఇబ్బంది పెడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో అధికారుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందాన తయారైంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించలేమని ఎవరైనా చెబితే.. ఏం మా మాట అంటే లెక్కలేదా అని బెదిరింపులకు దిగుతున్నారు.

మంత్రి బంధువు రుబాబు..

గంట్యాడ మండలంలోని లక్కిడాం సొసైటీ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) లో పని చేయడానికి ఇద్దరు వ్యక్తులను కూటమి నేతలు పంపించారు. వాస్తవంగా సొసైటీలో వారి అవసరం లేకపోయినా పంపించారు. తమకు సరిపడా సిబ్బంది ఉన్నారని సొసైటీ అధికారులు చెప్పినా కూటమి నేతలు పట్టించుకోవడం లేదు. వారిని తీసుకుంటారా లేదా అని తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్నారు. ఇప్పుడు ఏకంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బంధువు ఒకరు రంగప్రవేశం చేసి ఆ ఇద్దరినీ సొసైటీ ఉద్యోగులుగా పరిగణిస్తూ తీర్మానం చేయాలని సొసైటీ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డీఎల్ఈసీ ఆమోదం తప్పనిసరి

డిస్ట్రిక్ట్ లెవెల్ ఎంపవర్డ్ కమిటీ (డీఎల్ఈసీ) ఆమోదం లేకుండా ఎటువంటి నియామకాలు చేపట్టకూడదని 2019లో ప్రభుత్వం జీఓ జారీ చేసింది.



లక్కిడాం సొసైటీ కార్యాలయం

ఒకవేళ ఎవరైనా కమిటీ ఆమోదం లేకుండా నియమకాలు చేపడితే వారిని తొలగించే అధికారం కమిటీకి ఉంటుంది.

నోటిఫికేషన్ లేకుండా నియామకాలు..

ఏదైనా సంస్థలో ఖాళీలు ఏర్పడితే నిబంధనల ప్రకారం ఆయా ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి. రాత పరీక్ష గాని, మెరిట్ ఆధారంగా గాని నియామకాలు చేపట్టాలి. కాని కూటమి నాయకులు తమ మాటే నిబంధన అన్నట్లు వ్యవహరిస్తున్నారు. లక్కిడాం సొసైటీ వ్యవహారంలో కూటమి నేతలు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే లక్కిడాం సొసైటీ నష్టాల్లో ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నా దృష్టికి వచ్చింది..

2019 హెచ్ఆర్ పాలసీ ప్రకారం సొసైటీకి ఒక డీఈఓ ఉండాలి. లక్కిడాం సొసైటీకి ప్రస్తుతం ఒకరున్నారు. మరో ఇద్దరి కోసం సొసైటీలో తీర్మానం చేయాలన్న విషయం తన దృష్టికి వచ్చింది. సర్వేలు, ఇతర అవసరాల కోసం సిబ్బంది అవసరం అనుకుంటే ఎన్ని రోజులు అవసరమో అన్ని రోజులకు మాత్రమే తీసుకోవాలి. అటువంటి వారికి రోజువారీ వేతనం చెల్లించవచ్చు.

పి. రమేష్, జిల్లా సహకార అధికారి

అవసరం లేకపోయినా ఉద్యోగులను నియమిస్తే వారికే ఇచ్చే జీతాల వల్ల సొసైటీ మరింత నష్టాల్లోకి వెళ్లే అవకాశం ఉంది.

టీడీపీలో వర్గపోరు..

- వేర్వేరుగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం


చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం


మడక తిరుపతినాయుడు ఆధ్వర్యంలో వేడుకలు

రామభద్రపురం: టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీలో నెలకొన్న వర్గపోరు బయటపడింది. ఈ క్రమంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం శనివారం వేర్వేరుగా జరుపుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ఒక వర్గం గాను... టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండక తిరుపతినాయుడు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు వసంతుల తిరుపతిరావు, బవిరెడ్డి చంద్ర మరో వర్గంగా విడిపోయారు. మండల కేంద్రంలో ఉన్న పార్టీ కార్యాలయానికి కూడా మండక తిరుపతినాయుడు రాని పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే బేబీనాయన, పార్టీ మండల అధ్యక్షుడు కరణం భాస్కరరావు ఇరువర్గాలను కలిపేందుకు శతవిధాలా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలలో కూడా వైఎస్సార్‌సీపీ పోటీ చేయకపోయినా టీడీపీలో రెండు వర్గాలు పోటీ చేశాయి. పీఏసీఎస్ చైర్మన్ పదవికి ఎవరి ప్రయత్నం వారు చేసుకుంటున్నారు. పదవుల పందేరం జరిగితే పార్టీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి మరింత బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం ఉన్నప్పటికీ..రాజాం రూట్‌లో మరో కార్యాలయం ప్రారంభించి టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడకు వెళ్లాలో తెలియక తలలు పట్టుకున్నారు.

ఆర్మీ లెఫ్టినెంట్‌గా శ్రీవాత్సవ్


శ్రీవాత్సవ్‌ను అభినందిస్తున్న గ్రామస్తులు, బంధువులు

వీరఘట్టం: మండలంలోని నీలానగరం గ్రామానికి చెందిన పెరుమాలి శ్రీవాత్సవ్ ఆర్మీ లెఫ్టినెంట్‌గా ఎంపికయ్యాడు. ఈ మేరకు చెన్నైలోని ఆర్మీకి చెందిన ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఓటీఏ) నుంచి ట్రైనింగ్ లెటర్ వచ్చింది. ఆరు నెలల కిందట శ్రీవాత్సవ్ ఆర్మీ సర్వీస్ సెలక్షన్ బోర్డు పరీక్ష రాసి, రెండు నెలల కిందట ప్రయాగ్‌రాజ్‌లో ఇంటర్వ్యూ కూడా పూర్తి చేసుకున్నాడు. చెన్నైలో ట్రైనింగ్ పూర్తి చేస్తే లెఫ్టినెంట్ హోదాలో ఆర్మీలో సేవలందించనున్నాడు. ఇతని తండ్రి సింహాచలం పోలీస్‌శాఖలో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా.. తల్లి సునీత పాలకొండలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు.

ఇదీ నేపథ్యం..

శ్రీవాత్సవ్ నీలానగరంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆరు నుంచి 12 వరకు విజయనగరం జిల్లాలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదువుకున్నాడు. రాజాం జీఎంఆర్‌లో బీటెక్ పూర్తి చేశాడు. లెఫ్టినెంట్‌గా ఎంపిక కావడంతో గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి..

- 107,108 జీఓలు రద్దు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ

విజయనగరం గంటస్తంభం: విద్యారంగ సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం చేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ అన్నారు. శనివారం స్థానిక అమర్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ఐదు మెడికల్ కళాశాలలు మాత్రమే మంజూరు చేయడం సరికాదన్నారు. పైగా ఆయా కళాశాలల్లో పేదవారికి స్థానం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా మచిలీపట్నం, నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, విజయనగరంలో ఏర్పాటు చేయనున్న కళాశాలల్లో 35 శాతం సీట్లు అమ్ముకునేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 107, 108 జీఓలను రద్దు చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ యూనియన్ సభ్యులు

జిల్లా సభ్యుడు ఎస్. నాగభూషణం మాట్లాడుతూ .. విజయనగరం జిల్లాలో గిరిజన యూనివర్సిటీకి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్, ఉపాధ్యక్షుడు ఎ.సుమన్, శ్రావణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, శంకరరావు, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

12 మంది గైర్హాజరు ..

పార్వతీపురం టౌన్: పదో తరగతి ఒకేషనల్ పరీక్షకు 12 మంది గైర్హాజరయ్యారని డీఈఓ ఎస్.తిరుపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం జరిగిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. 2636 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా.. 2624 మంది హాజరయ్యారని తెలిపారు.


తిరుపతినాయుడు, డీఈఓ

నియామకాలు..

విజయనగరం: వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా శాఖకు సంబంధించి నూతన నియామకాలు జరిగాయి. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ విభాగాలకు సంబంధించి బొబ్బిలి నియోజకవర్గ అధ్యక్షుడిగా గెదల అప్పన్న, గజపతినగరం నియోజకవర్గానికి వంగపండు లక్ష్మీనాయుడు, రాజాం నియోజకవర్గానికి పాలవలస శ్యామ్, చీపురుపల్లి నియోజకవర్గానికి గుడివాడ వెంకట శ్రీరాములనాయుడు, ఎస్ కోట నియోజకవర్గ అధ్యక్షుడిగా మోపాడ కృష్ణంనాయుడు నియమితులయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ పీడీలు

విజయనగరం అర్బన్: డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ఇద్దరు ట్రైనీ అధికారులు శనివారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాకు చెందిన పి.ఝాన్సీరాణి, కాకినాడ జిల్లాకు చెందిన జి.శ్రీనివాసరావు కలెక్టర్‌ను కలిసి శిక్షణకు సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. వారివెంట డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి కూడా ఉన్నారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి ఆటోస్టాండ్ సమీపంలో కొంతమంది వ్యక్తుల నుంచి రెండు చిన్న బ్యాగులలో ఉన్న సుమారు 12 కిలోల గంజాయిని పెదమానాపురం పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై ఎస్సై జయంతి వద్ద ప్రస్తావించగా.. గంజాయి స్వాధీనం చేసుకున్న మాట వాస్తవమేనని, అయితే నిందితులు తప్పించుకుపోవడంతో, వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు జ్యోత్స్న

జయనగరం: గుంటూరులో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎ. జ్యోత్స్న అద్భుత ప్రతిభ కనబరిచింది. నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన డిబేట్‌లో ప్రథమ బహుమతి కైవసం చేసుకుని జాతీయ పోటీలకు ఎంపికైంది. ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో కూడా రాణించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ మేరకు జ్యోత్స్నను కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కేవీ ఉజ్వల్ శనివారం ప్రత్యేకంగా అభినందించారు.



జ్యోత్స్నకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా నాలుగు ఫిర్యాదులకు సంబంధించిన విచారణను శనివారం స్థానిక కలెక్టరేట్‌లో చేపట్టారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక, డీఆర్‌ఓ హేమలత, జిల్లా రిజిస్ట్రార్ పి. రామలక్ష్మి పట్నాయక్, జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి పి. లక్ష్మణరావు, సంబంధిత తహసీల్దార్లు, ఫిర్యాదుదారుల సమక్షంలో విచారణ చేపట్టి, సమస్యలను పరిష్కరించారు.


ట్రైనీ పీడీలను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



విచారణ చేపడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

మెంటాడ: మండలంలోని కైలాం గ్రామానికి చెందిన ఇద్దరు బెట్టింగ్ రాయుళ్లను ఆండ్ర ఎస్సై కె. సీతారామ్ శనివారం అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేపట్టగా ఓ ఇంటిలో ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. వారి నుంచి ల్యాప్‌టాప్, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

అందివచ్చిన కొడుకు అనంత లోకాలకు...

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య
- మృతుడి స్వస్థలం సాలూరు మండలం శివరాంపురం

అక్కిరెడ్డిపాలెం: ఒక్కగానొక్క కొడుకు అందివచ్చాడని ఆనందంతో ఆ తల్లిదండ్రులు ఉన్నారు. ఇంతలో ఏం జరిగిందో ఏమో కానీ ఆ కొడుకు ఉరి వేసుకున్నాడని తెలియడంతో ఆ కుటుంబం తల్లడిల్లి పోయింది. గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం శివరాంపురానికి చెందిన వసంతల యతీష్ కుమార్ (25) పరవాడలోని వసుధా ఫార్మా కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో యువకుడు రాజశేఖర్‌తో కలిసి గాజువాకలోని చైతన్యనగర్‌లో సీఎంఆర్ సెంట్రల్ వెనుక ప్రాంతంలో అద్దెకు ఉంటున్నారు. శుక్రవారం ఐపీఎల్ మ్యాచ్‌ను ఇరువురూ కలిసి మద్యం సేవిస్తూ చూశారు. రాత్రి కొంత సమయం తర్వాత రాజశేఖర్ పడుకున్నాడు. అర్ధరాత్రి రాజశేఖర్‌కు మెలకువ వచ్చింది. అప్పటికే యతీష్ ఫ్యానుకు దుప్పటితో ఉరివేసుకుని వేలాడుతూ ఉన్నాడు. వెంటనే రాజశేఖర్ 112కు డయల్ చేసి ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి సీఐ పార్థసారథి సిబ్బందితో చేరుకుని వివరాలు సేకరించారు. యతీష్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కాగా యతీష్ కుమార్ తండ్రి రామారావు వ్యవసాయం చేస్తుంటాడని, తల్లి, సోదరి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఐటీఐ చేసిన యతీష్ కుమార్ చాలీచాలని జీతం వస్తుండడంతో మనస్తాపం చెంది కొద్ది రోజులుగా మద్యం అతిగా సేవిస్తున్నాడని అతని స్నేహితులు తెలిపారు.


వసంతల యతీష్ కుమార్(ఫైల్)

మతం కన్నా మానవత్వం మిన్న

- ఘనంగా ఇఫ్తార్ విందు

విజయనగరం టౌన్: పవిత్ర రంజాన్ పండగ సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. మత గురువు ఖాజీ హుస్సేన్ ఆధ్వర్యంలో ముస్లిం మతపెద్దలు నమాజ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ, వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మతంకన్నా మానవత్వం మిన్న అని, విజయనగరం మత సామరస్యానికి, మత సహనానికి మారుపేరన్నారు. సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో శుభకరమాసమన్నారు. అందరూ ఆనందంగా, ఆరోగ్యంతో ఉండాలని ముస్లింలు నెలరోజుల పాటు కఠోర దీక్ష చేస్తారన్నారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులతో పాటు రాష్ట్ర తూర్పు కాపు చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, డీఆర్వో ఎస్.శ్రీరామూర్తి, ఆర్డీఓ కీర్తి, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఆర్ ఎస్. జాన్ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, రాష్ట్ర తూర్పు కాపు చైర్‌పర్సన్ తదితరులు

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బెల్లాన

విజయనగరం లీగల్: విజయనగరం జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది బెల్లాన రవిను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ విశాఖ జోనల్ యూనిట్ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అడిషనల్ డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన జిల్లా కేంద్రంలో ఉన్న ఎన్‌డీపీఎస్ స్పెషల్ కోర్టు, మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టులో ప్రాసిక్యూషన్ తరఫున విధులు నిర్వహిస్తారు.


బెల్లాన రవి

మాటిచ్చి.. మాయచేశారు..!

అధికారంలోకి వచ్చిన వెంటనే రైతన్నలకు రూ.20వేలు పెట్టుబడి సాయం అన్నారు..
తుస్‌మనిపించారు.
అమ్మఒడిని కాస్త తల్లికి వందనంగా పేరుమార్చి..
ఏడాదిగా ఏమార్చారు.
చేనేత కార్మికుడు సాయం అడిగితే..
రిక్తహస్తం చూపిస్తున్నారు.
నిరుద్యోగ భృతిపై ప్రశ్నించిన యువతపై..
కన్నెర్రచేస్తున్నారు.
ఉగాది సాక్షిగా వలంటీర్లను కొనసాగిస్తామని... జీతం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని..
తుంగలోకి తొక్కిన కూటమి ప్రభుత్వం తీరుపై జనం భగ్గుమంటున్నారు. చంద్రబాబు అండ్ కో తీరుతో జిల్లాలోని 530 సచివాలయాల పరిధిలోని 8,774 వలంటీరు కుటుంబాలు ఉపాధిలేక రోడ్డున పడ్డాయని వాపోతున్నారు. ఉగాది వేళ గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలంటీర్లకు అందజేసిన ప్రోత్సాహకాలను తలచుకుని ప్రస్తుత ప్రభుత్వ తీరును దుమ్మెత్తి పోస్తున్నారు.
– పార్వతీపురంటౌన్


వలంటీర్లను సత్కరిస్తున్న అధికారులు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు (ఫైల్)

- ఆశ చూపి.. పొట్టకొట్టిన కూటమి
- గౌరవవేతనం రూ.10 వేలకు పెంచుతామంటూ గతేడాది ఉగాది రోజున ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ప్రకటన
- ఎవరినీ తొలగించం అంటూ హామీ
- అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైనం
- రోడ్డున పడిన 5,638 మంది వలంటీరు కుటుంబాలు

అంతన్నారు... ఇంతన్నారు...



ఎన్నికల ముందు కూటమి నేతలు అధికారంలోకి వస్తే అంత చేస్తాం.. ఇంతచేస్తాం అంటూ నమ్మించారు. అధికారం చేపట్టాక ప్రజాసంక్షేమాన్ని పక్కనపెట్టారు. అన్నివర్గాల ప్రజలకు క్షోభ మిగిల్చారు. వలంటీర్ జీతంతో బతికే మాలాంటి కుటుంబాలకు అన్యాయం చేశారు. మా ఉసురు తప్పకుండా తగులుతుంది.

– సాయి గణేష్, వలంటీర్, పార్వతీపురం పట్టణం

జగనన్న ఉంటే బాగుండేది.



గతంలో జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రజలకు సేవలందించే అవకాశం కల్పించారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను అందించేవారు. రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహించేవాళ్లం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ల వ్యవస్థను రద్దుచేశారు. మాకు అన్యాయం చేశారు.

– సౌజన్య, వలంటీర్, పార్వతీపురం పట్టణం

నమ్మించి మోసం చేశారు



కూటమి నేతలు ఎన్నికల ముందు వలంటీరుకు రూ.10వేలు వేతనం అందజేస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారం చేపట్టిన తరువాత రెట్టింపు చేయడం పక్కన పెడితే వలంటీర్ వ్యవస్థనే తీసేశారు. ఏటా ఉగాది సమయానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సేవా మిత్ర, సేవా వజ్ర, సేవారత్న పురస్కారాలతో గౌరవించేది. కూటమి ప్రభుత్వం వలంటీర్లను పూర్తిగా మోసం చేసింది.

– ఎస్.అనిల్, వలంటీర్, పార్వతీపురం పట్టణం